# సాకేత

"అసలు మాటకొస్తే పూర్వపు సాహిత్యంలో ఉన్న చాతుర్యమే వేరంటాను నేను" అంటూ పరబ్రహ్మంగారు కుర్చీలోనించి బరువుగా లేచి, నిమ్మళంగా అడుగులు వేసుకుంటూ వరండా చివర వరకు వెళ్లి నోట్లో ఉన్న సన్నని లంక పుగాకు చుట్ట ఆవరణలోకి విసిరిపారేశారు. అది కాస్తా వెళ్లి, పోయిన ఏడు గాలివానకి పడిపోయి సగం వేళ్లు గాలిలో ఉన్నా ఇంకా బతికి ఉన్న యూకలిప్టస్ ఆయిల్ చెట్టుకి తగిలి కింద ఎండిన ఆకుల్లో పడిపోయింది. ఆ చుట్ట విసురుకి చెట్టు మీద గుమిగూడి ఉన్న మెరుగుడు గువ్వల గుంపు చెల్లా చెదురై మళ్లీ వెంటనే సర్దుకున్నాయి. వారు నిదానంగా తిరిగి వచ్చి కుర్చీలో కాళ్లు దగ్గరగా పెట్టుకుని కూర్చున్నారు.

తన ఎదురుగా రౌండ్ టేబుల్‌కి ఆ ప్రక్కన కుర్చీలోనించి సుబ్బన్న శాస్త్రిగారు, "అది నిజమేననుకోండి. మరి అల్లాగే కదా, సీతమ్మ వారి అంద చందాలు శ్రీరాములు వారు హనుమంతుడితో వర్ణించి చెప్పారుట గదా. లంకకి వెళ్లిన ఆ హనుమంతుడు రావణా బ్రహ్మ పక్కని ఉన్న మండోదరిని చూచి ఇదేమిటి సీతమ్మ తల్లి ఇల్లా ఇతని పక్కన పడుక్కున్నారు అని నివ్వెర పోయాడుట గదూ. మరి మండోదరి సౌందర్యం వర్ణించడానికి అంతకంటే ఏమి నిపుణం కావాలంటారు?" అన్నారు చుట్టూ అందర్నీ చూస్తూ.

పక్కన రాధాకృష్ణగారు వెంటనే అందు కున్నారు "ఇల్లాగే హోమరు కవీశ్వరుడు 'ఇల్లియడ్' గ్రంథంలో చెబుతాడూ" అంటూ ఆరంభించారు.

పరంబ్రహ్మంగారు ముఖం ముందు పెట్టి మరీ వింటున్నారు. రాధాకృష్ణగారు పొడిగించారు. "ట్రాయ్ పట్టణపు రాజు ప్రయామ్ కుమారుడు హెలెన్ అనే ఒక సుందరిని దొంగతనంగా లేవదీసుకుని తన స్వంత పట్టణానికి పారిపోయి చక్కా వచ్చేశాడుట. అందుకని ఆ హెలెన్ వాళ్ల కుటుంబీకులు యావన్మందీ, సైన్యాలతో వచ్చి ట్రాయ్ కోటని ముట్టడించారు. కోట ప్రాకారల క్రింద ఘోర యుద్ధం జరుగుతూంది. కోట మీద వృద్ధ రాజు ప్రయామ్ అత్యవసర యుద్ధ సమావేశం జరుపుతున్నారుట మంత్రులతో. యుద్ధం ఎట్లా జరుగుతూందో చూడ్డానికి కోట బురుజుల వద్దకు వచ్చి హెలెన్‌ని చూచి ఆ ముసలి రాజు 'ఆమె ఎవ్వరు?' అని అడిగాడుట. 'ఆవిడే హెలెన్' అన్నారుట మంత్రి. అప్పుడు 'ఇంత మహా ఘోర యుద్ధం ఆవిడ కోసం జరుగుతూంది అంటే ఆశ్చర్యం ఏమీ లేదు' అన్నారుట ఆ ముసలి రాజు. అంత కంటే ఏ చాతుర్యం కావాలి చెప్పండి హెలెన్ మహా సౌందర్యం వర్ణించడానికి" అంటూ చేతి గుడ్డతో ముఖం తుడుచుకున్నారు.

"అసలు రామాయణమూ, ఇల్లియడ్ కూడా జరిగిన కథలు కావు. ఒట్టి పుక్కిట పురాణాలేనని కొంతమంది ఒక వాదం లేవదీశారు మీకు తెలుసా?" అడిగారు అనంత రామయ్యగారు.

అందరికీ కాస్త ఎడంగా పడక కుర్చీలో కూచున్న భుజంగరావు గారు"రామ! రామ!" అంటూ లేచి వెళ్లి హాల్లో సాయంత్రపు లైటు వేసి, వచ్చి వరండాలో కూడా లైటు వేసి తిరిగి కూచోబోతూ, "అరెరే వామనరావుగారు వస్తున్నారే, గేటు మూసే ఉంచారు. ఒక్క నిమిషం క్షమించాలి. గేటు తెరిచి వస్తా" అంటూ గబగబ వరండా మెట్లు దిగి గేటు వద్దకు నడిచారు.

ఆవరణలో గోడ పక్కగా ఉన్న నిద్రమావి చెట్టు ఆకులన్నీ ముడుచు కుంటూంది. కాస్త వెనక పక్కగా వేప చెట్టు కింద ఏనాడో నూరు ఏండ్ల క్రితం సున్నం విసిరిన పెద్ద పెద్ద తిరగళ్లు భూమిలో పాతుకుపోయి, జానెడు మేర పైకి పొడుచుకుని ఉన్నాయి. వాటి మీద కూచుని ఆరిన గుడ్డలన్నీ మడతలు పెడుతూంది వయస్సు మళ్లిన పనిమనిషి సోమాలు. మేడ మీద నుంచి వెనకవేపు కొబ్బరి చెట్లల్లోకి కొంగ ఒకటి ఎగిరి పోయింది తన గూట్లోకి.

ఉన్నట్టుండి రౌండు టేబుల్ వద్ద 'టప్' అని ఒక శబ్దం వినిపించింది. చుట్టూ కూచున్న అందరూ ఉలిక్కిపడ్డారు. "ఏమయింది? ఏమిటిది?" అని

తలా ఒక ప్రశ్న వేశారు గాభరాగా. "ఆఁ! ఏమీ లేదు లెండి. గాభరాపడకండి. సున్నపు బెల్లు ఒకటి పైకప్పులోనించీ ఊడి టేబుల్ మీద పడ్డది. అదీ ఆ శబ్దం'' అన్నారు చిరునవ్వుతో రాధాకృష్ణగారు ఆ గెడ్డా, చెదిరిన ముక్కలు ఏరుతూ." ఏనాడు కట్టిన భవంతో ఇది మరి?' అన్నారు సుబ్బన్నగారు. 'మరి రిపెయిర్స్ కూడా లేదు గదా' అంటూ ఆ సున్నపు రాళ్లు వరండా బీటల్లో మొలిచిన రావిమొక్క మీదికి విసిరి వేశారు రాధాకృష్ణ. "పెద్దా చిన్నా జమీలన్నీ పోనేపోయే... రాబడి లేదాయె మరి" అందుకున్నారు వీరబ్రహ్మంగారు.

వీరి పూర్వీకులు ఎవ్వరో బ్రిటిష్ వారి కొలువులో ఉండేవారుట గదా?'' అడిగారు అనంతరామయ్యగారు. "అవునవును. నాగేంద్ర రావుగారు. వారు బ్రిటిష్ వారికి ఏదో సహాయం చేశారుట. అందుకని మెచ్చి కేతవరం గ్రామం వారికిచ్చారటి అన్నారు వీరబ్రహ్మంగారు. "అట్లాగా!'' అన్నారు రాధాకృష్ణగారు. "అవును. అందుకనే ఈ మేడకి సాకేత అని పేరు పెట్టారట వారు. మనకి పైన, మేడ ఆర్చీ మీద రాతితో ఆ పేరు చెక్కించిందీ వారేనుట మా తాతగారు చెప్పారు నా చిన్నతనంలో'' పొడిగించారు పరబ్రహ్మంగారు.

"ఆయన మహా చండశాసనుడట గదూ? ఆడిన మాట తప్పకూడదు అని ఒక శాసనమే పెట్టారుట గదా తన కుటుంబంలో?'' అడిగారు రాధాకృష్ణగారు.

"దానికి కారణం ఏమిటంటే, అల్లా మాట తప్పినందువల్ల పెద్ద కీడు ఏదో కలిగిందట వారికి పూర్వం. ఇదంతా టవున్ హాల్లో భోగట్టా'' అన్నారు అనంత రామయ్యగారు.

"చూశారా... మనం ఇక్కడ కబుర్లలోనే ఉన్నాం. భుజంగరావు గారి పిల్లలు కూడా వచ్చేశారు" అన్నారు రాధాకృష్ణ.

అందరూ గేటు కేసి చూశారు. అలసిపోయిన ముఖంతో స్టెతస్కోప్, బాగ్ పట్టుకుని డాక్టరు వసుంధర ఒక పక్కన తన తమ్ముడు శశిభూషణ్‌తోనూ, ఒక పక్కన స్కూటర్ నడిపించుకుంటూ కిశోర్‌తోనూ గేటులో నుంచీ చిరునవ్వుతో నమస్కరిస్తూ వస్తోంది.

'కిశోర్ భుజంగరావు గారికి నమ్మినబంటు' అన్నారు సుబ్బన్న. "అదేమిటి. వారి కుటుంబానికే సన్నిహితుడు' అందుకున్నారు పరబ్రహ్మం. "ఇహ అమ్మడానికి

స్థలాలు లేకపోతే కూడా భుజంగరావుగారు వారి కాంపౌండులోనే అవుట్ హౌస్ అమ్మేరుట గదా ఆ కిశోర్ తండ్రికి. ప్రాణ స్నేహితులట! పొడిగించారు పరబ్రహ్మం. "యోగ్యుడు. తండ్రిపోయాక తల్లిని కాపాడుతూ ఉద్యోగం చేసు కుంటున్నాడు" అందుకున్నారు రాధాకృష్ణ. "వసుంధర అంటే కిశోర్‌కి పంచ ప్రాణాలుటగా. అసలు వాళ్లిద్దరూ కాలేజీలో చదువుకునే రోజుల్లో పెళ్లాడతారే అనుకున్నారట అందరూ. మా చిన్నబ్బాయి చెప్పేవాడు" అన్నారు అనంతరామయ్య.

"అదెల్లా సాధ్యం? సాకేతలో పుట్టిన పడుచుని పెళ్లాడమని అడగడం సాధ్యమా? దానికి ధైర్యం ఉండవద్దూ?" అన్నారు పరబ్రహ్మంగారు.

"అందులోనూ గోల్డు మెడలిస్టు. పైగా ఇంత చిన్న వయస్సులోనే యమ్.డి. ఒకటి పాస్ అయిందామరి" అన్నారు సుబ్బన్న. "అది భుజంగరావుగారి అదృష్టం" అని అనంతరామయ్య అంటూండంగానే భుజంగరావుగారు, అందరూ వరండా మెట్లెక్కి వచ్చేశారు. చిన్నవాళ్లు ముగ్గురూ పెద్దలకి నమస్కరించి అక్కడే ఆగి మాట్లాడుతుండంగా, వామనరావుగారు రౌండు టేబుల్ వద్దకి వచ్చి నమస్కరిస్తూ, "అదృష్టవంతులు మీరంతా. ఎంత చక్కగా రోజూ వచ్చి సాకేతలో..!" అంటూండంగానే, పరబ్రహ్మంగారు "అది ఈనాటి అలవాటాండీ. మాతాత తండ్రు లందరూ సాకేతకి రాకపోతే ఏమీ తోచదుట వాళ్లకి" అన్నారు చిరునవ్వుతో.

"మీరు ఎంచక్కా సాహిత్య గోష్ఠి, రిటైర్డ్ లైఫ్, నేను చూడండీ గానుగఎద్దులా ఇవ్వాళ పాఠాలూ, రేపటి పాఠాలూ అని అదే పని" అన్నారు వామనరావు గారు.

"అల్లా మీ రనకూడదు. బ్రదర్! మీ నిరంతర కృషి వల్లనేగదా మా వసుంధర ఇంత గొప్పగా పాస్ అయింది" అన్నారు రాధాక్రిష్ణ. "ఇది మహ బావుంది. అది మహ తెలివైన పిల్ల. అక్కరగా చదివింది. నా గొప్పతనం ఏముందీ? ఇంతకీ ఆ విషయానికే మిమ్మల్ని ఆహ్వానించడానికి వచ్చాను. అడ్రస్సులు కూడా వ్రాసే తెచ్చాను. ఎల్లుండి ఆదివారం అమ్మాయికి ఒక చిన్న పార్టీ. సన్మానం కాలేజీలో ఏర్పాటు చేసాం. మీరందరూ తప్పకుండా రావాలి." అంటూ, బ్యాగ్‌లోనించి ఇన్విటేషన్సు తీశారు.

"మేము లేకుండా వసుంధరకి గౌరవం ఎల్లా చేస్తారు మీరు? తప్పకుండా వస్తాం" అన్నారు నవ్వుతూ అనంతరామయ్య. "మాకందరికీ ఎంత గర్వంగా

ఉందో!'' అన్నారు పరబ్రహ్మంగారు పత్రికలు అందుకుంటూ, ''మనకే కాదు! ఈ రాయబారు ఊరుకే వసుంధర గర్వకారణం'' అన్నారు అనంతరామయ్య.

పత్రికలిచ్చి, చిరునవ్వుతో నమస్కరిస్తూ, లేచి ''మరి క్షమించాలి. తీరుబడిలేదు. అంతా నేను చూడాలి. పైగా ఇంట్లో చుట్టాలు. అన్నట్టు ఆదివారం మధ్యాహ్నం మా ఇంటికి భుజంగరావుగారి కుటుంబాన్ని విందుకి పిల్చాను. వారు దయతో ఒప్పుకున్నారు. ఉండనా?" అంటూ బాగ్‌పట్టుకుని భుజంగరావు గారి వద్దకి వచ్చి, ''కిశోర్! నువ్వు లేకపోతే భుజంగరావుగారు లేరు. పెందలాడే తీసుకొనిరా. కాస్త కబుర్లు చెప్పుకుందాం తీరుబడిగా. అమ్మాయ్! వెళుతున్నాను. భుజంగరావు గారూ! చాలా థేంక్స్ ఎదురు చూస్తుంటా" అంటూ మెట్లు దిగారు.

శశి వామనరావుగారిని కారులో ఎక్కించి మరీ వరండాలోకి వచ్చాడు తిరిగి. అంతలో పెద్దవాళ్లు నలుగురు దగ్గరకొచ్చి ''అమ్మాయ్! మహా సంతోషంగా ఉంది మాకందరికీ. మరి ఎల్లుండి ఫంక్షన్‌కి సర్దుబాట్లూ అవీ ఉంటాయి గనుక రేపు మేము రాము, భుజంగరావుగారూ! పార్టీలో కలుసుకుందాం. మేమూ నడుస్తాం" అంటూ గేటు కేసి తిరిగారు.

ఇహను అందరూ వెళ్లిపోయాక, వసుంధర స్నానం చేసిన తరువాత, హాల్లో విశ్రాంతిగా భుజంగరావుగారు పిల్లలతో శశి చేసి ఇచ్చిన వేడి టీ తాగుతుండగా, ''అక్కా! ఎల్లుండి ఏమీ టైమ్ ఉండదు. కావలసిన బట్టలూ, అవీ ఈ వేళే తయారు చేసుకోనివ్వు" అన్నాడు శశి.

''మేడ మీద పెద్ద బీరువాలో మీ అమ్మ పట్టు చీరలు ఉండాలమ్మా! అవి నీకేమైనా పనికి వస్తాయేమో చూడు" అన్నారు భుజంగరావుగారు.

''అయితే పెందలాడే భోంచేసి, అవి చూద్దాం నాన్నా!" అన్నాడు శశి.

భోజనాల టైమ్‌కి కిశోర్ ఒక డబ్బాలో వేయించిన అప్పడాలు తెచ్చాడు. ''కందట్టా? అది అమ్మకి చాలా ఇష్టమే'' అంటూ ఒక అట్టు ప్లేటులో వేసుకునివెళ్ల బోయే సరికి, శశివచ్చి ''నువ్వు కూడా ఒకటి తిను" అంటూ ఇంకొకటి తీసి వేశాడు.

సంతోషంగా కబుర్లతో ముగ్గురూ భోంచేశారు. తరువాత అక్కయ్య అట్టు చాలా ఇష్టంగా తినడం కనిపెడుతున్న శశి, తన కంచంలోనించీ తన అట్టు కూడా తీసి వసుంధర కంచంలో వేశాడు.

"బాగుందిరా" అంటూ తినేసింది అక్క.

భోజనాల దగ్గరనించీలేస్తూ, "అదేమిట్రా, కంద మరికాస్త చేసుకోకూడదూ? నీ అట్టుకూడా అక్కయ్యకే వేశావు'' అన్నారు భుజంగరావు గారు. "ఇంకోసారి చేస్తానులే నాన్న - ఇవన్నీ సోమాలు తీస్తుంది లే పైకి వెళదాం" అన్నాడు శశి.

"ఏమిటోరా నాయనా! నువ్వు భూమి మీద పడంగానే, తన బాధ్యతలన్నీ నీ చెవులో ఊది మరీ వెళ్లిపోయింది గావోల్ను మీ అమ్మ" అని వినీ వినపడకుండా అంటూ మెట్లు ఎక్కారు నాన్న కూడా.

"మీ అమ్మపోయినప్పట్నించీ ఇది తెరవనే లేదురా!" అంటూ, అతి కష్టం మీద తెరిచారు బీరువా. అన్నీ సరిగ ముద్దలాంటి పట్టుచీర లున్నాయి లోపల. "అక్కయ్యకి ఇవన్నీ పనికి రావు నాన్నా" అన్నాడు శశి.

"ఇదిగోరా శశీ! ఒకటుంది" అంటూ బీరువాలో ఒక పక్క నించీ ఎర్ర రంగు పట్టుచీర బయటికి తీసింది. దానికి అంచు మాత్రమే సరిగ ఉంది. నాగరికంగా, అందంగా ఉంది చీర. శశి కూడా "నీకు చాలా బావుంటుం దక్కా.'' అన్నాడు. తండ్రితో చెప్పంగానే, "అదా, శశి పుట్టకలకి మీ అమ్మకి నేను కొన్నా నమ్మా. పాపం. అది కట్టుకో కుండానే వెళ్లిపోయింది. నువ్వు కట్టేసుకో అమ్మా! పెట్టె చీకుడు అయ్యేది ఇంకా నయ్యం. నీకు బాగుంటుందమ్మా' అన్నారు తృప్తిగా. చీరలు తిరిగి పెట్టేస్తూ ఆత్రుతగా "నాన్నా! ఈ అర ఉన్నట్లే తెలియడం లేదు. ఇందులో ఏముందో చూద్దాం. ఇది కూడా తెరవండి నాన్నా చూద్దాం" అంది "అదా ఆ! ఏమీ లేదు తప్పుకోండి తాళం వేస్తాను," అంటూ దగ్గరగా వచ్చారు.

"నాన్నా ప్లీజ్! అందులో కూడా ఏమైనా దొరకవచ్చు. తెరవండి నాన్నా" అంది గారాబంగా.

"దానిలో ఏమీ లేదురా తల్లీ ఇవతలికి రా'' అన్నారు తండ్రి.

"ఊహు! నన్ను చూడనియ్యాలి" అంది.

"మూర్ఖంగా ఉండకమ్మా" అన్నారు నాన్న కాస్త కటువుగా.

"అన్ని సార్లు అడుగుతుంటే అక్కయ్య తియ్యనివ్వండి నాన్నా. నా చేతికివ్వండి ఆ గుత్తి" అంటూ చెయ్యి చాచి తీసుకుని అమిత కష్టం మీద సొరుగు తెరిచేశాడు శశి.

"దానికి తోచదు. చెబితే వినదు'' అంటూ పక్క కుర్చీలో కూచోబడి పోయూరు నాన్న "అది తెరిచి ఎన్నేళ్లు అయిందోరా'' అంటూ, లోపల చెయ్యిపెట్టి వెతికి "ఇదేమిటి నాన్నా! ఏదో పాత నగ గావోల్ను'' అంటూ ఆ నగని పైకి తీసింది.

"అమ్మాయ్! దాన్ని గజ్జల పట్టెడ అంటారు. ఈ కాలం వాళ్లు ఎవ్వరూ అలాంటిది వాడరు" అన్నారు భుజంగరావుగారు. తెలిసీ తెలియని విసుగుతో "అది తిరిగి పెట్టెయ్యండ్రా, పిల్లలూ" అన్నారు కాస్త గట్టిగానే.

"ఉండు నాన్నా'' అంటూ లైటు కిందికి వచ్చి పట్టెడ సాంతంగా చూచింది కాస్త కొంగుతో తుడిచి లైట్లు వెలుగులో పట్టెడలో అమర్చిన ఎర్ర కెంపులూ, వజ్రాలూ, చుట్టూ మూడు వరుసలు కట్టిన మంచి ముత్యాలూ ధగధగ మెరిసినాయి. 'ఎంత ఆర్టిస్టిక్‌గా ఉందక్కా! ఇది' అన్నాడు శశి దగ్గరగా వచ్చి.

"బంగారమే కాస్త నల్లబడ్డదిరా!" అంది వసుంధర మెడకి చుట్టూ దాన్ని ఆన్చి చూసుకుంటూ.

"పిల్లలూ! ఆ పట్టెడ శాప గ్రస్తమైం దమ్మా నీకది వద్దు!'' అన్నారు భుజంగ రావుగారు ఖచ్చితంగా.

"నాన్నా ఇంత పెద్ద కాలేజీ చదువులు చదివిన మీరా, నాన్నా, శాపాల్లో ఇంత నమ్ముతున్నారు అంది వసుంధర కాస్త అపనమ్మకంతోను, చిరునవ్వుతోనూ, "పైగా ఈ సెంటిఫిక్ యుగంలోనా!'' పొడిగించింది.

"అంత ఆశగా అక్కయ్య అడుగుతూంటే మీరేమిటి నాన్నా ఇలా'' అన్నాడు శశి. "ఈ రోజుల్లో ఇంత పాతకాలపు బరువు నగ ఎవ్వరూ పెట్టర్రా'' అన్నారు నాన్న. 'ఇపుడు పాత కాలపు ఫాషన్లన్నీ తిరిగి ఇప్పుడు వస్తున్నాయి గదా నాన్నా' అన్నాడు శశి బ్రతిమాలినట్టూ.

"ఒరేయ్ ఎంత చెప్పవద్దనుకున్నా నానోటితో చెప్పించేవరకూ ఊరుకునే టట్టూ లేరర్రా మీ ఇద్దరూ. మా తాతగారి ముత్తాతగారికి ఒక్కతే ఒక కూతురట. ఆయన నాగేంద్రరావుగారని ఆరు ఏండ్లకే కూతురుకి పెళ్లి చేద్దామని ఈ పట్టెడ బాల తొడుగు కని చేయించి ఆ అమ్మాయి పెళ్లిలో పెట్టారుట. పెళ్లికొడుకు కాస్తా కంకణాలు విప్పక ముందే పోయాడుట'' అన్నారు.

శ్రద్ధగా వింటున్న శశి "అయ్యయ్యో! ఎల్లా" అడిగాడు.

"కాలులో ఏదో మేకు గుచ్చుకుని మోపెక్కి జ్వరం వచ్చిందట" పొడిగించారు.
"ఛ!ఛ! పాపం ఆ అబ్బాయి! ఈ రోజుల్లో అయితే పోయే ఉండడు నాన్నా! ఆ రోజుల్లో యాంటీ బయాటిక్స్ లేవు మరి. అదీ సంగతి" అంది జాలిగా వసుంధర.

"అప్పట్నించీ ఇప్పటి వరకూ, మన ఇంట్లో ఈ పట్టెడ ఎవ్వరూ ముట్టలేదురా. అదృష్టహీనమని మన కొద్దమ్మా ఇది" అన్నారు నాన్న.

"నాన్నా! నాన్నా! ఇంత మూఢనమ్మకమా! ఇది శాస్త్రీయ యుగం నాన్నా! ఇంత పెద్ద కాలేజి చదువులు చదివిన మీరా నాన్నా ఇలా మాట్లాడడం!" అంది వసుంధర.

"దాని మీద ఏదో శాపం ఉందని నాగేంద్రరావు గారికి నమ్మకం తల్లీ" అన్నారు నాన్న.

"వారి కాలం కాదు, నాన్నా! శశీ! ఇది రేపు బజారు వెళ్లి పాలిష్ చేయించుకు రా" అంది వసుంధర పట్టెడ తమ్ముడి కిస్తూ.

ఇహను చేసేదేమి లేక, భుజంగరావుగారు బీగాల గుత్తి చేత పట్టుకొని తన గదిలోకి నిమ్మళంగా వెళ్లి, నుదిటి మీద చెయ్యి వేసుకుని, కళ్లు తెరిచి పడుకున్నారు, నిద్ర కోసం.

ఆరాత్రి ఎందుకో దిగ్గున మెలుకువ వచ్చింది వసుంధరకి. ఏవేవో అతి బాల్యపు జ్ఞాపకాలు రానారంభించినాయి. ఎవ్వరెవ్వరో నోరు జారి బయటపెట్టిన కథలవ్వి. అలాగే గాలిలో నిల్చిపోయిన మాటలు. అమ్మ చనిపోయిన రాత్రి అది. అవును కుంభవృష్టి బయట, పౌర్ణమి అట అది. వృద్ధ వంటలక్క వెంకాయమ్మగారి భుజం మీద ఏడ్చి ఏడ్చి పడుకున్న తన చెవులకి వినొచ్చిన మాటలు – చీకటి మూలల్లో భయంగా సాకేత పనివాళ్లు గుసగుస చెప్పుకున్నవి. అవును సాకేతలో శాపం ఉందిట. ఎవ్వరూ ఎవ్వరికీ బొట్టెట్టి పిల్చి చెప్పలేదు. ఎవరూ శ్రద్ధగా వినసూ లేదు, చెవులిచ్చి.

ఏనాడో బ్రిటీష్ వారి కొలువులో ఉద్యోగిగా ఉన్న నాగేంద్రరావుగారితో, అధికారులు "దారి దోపిడి దొంగల ఒక అడివి ముఠా ఈ ప్రాంతంలో ఉందట. ప్రజాక్షేమం కోసం ఆ గుంపుని అదుపులో పెట్టాల మనం. దాని ఆచూకి తెస్తే,

పెద్ద బహుమతి ఇస్తారు సర్కారువారు" అన్నారుట. నాగేంద్రరావుగారు, . ఆ ముఠా నాయకుడి కూతురుతో ఎల్లాగో స్నేహం చేసి, ప్రేమించినట్టూ నటించి, వాళ్ల గుట్టు మట్టు తెలుసుకోడానికని ఏటి ఒడ్డున పెళ్లాడతానని మాట ఇచ్చి, వివరాలు తెలుసుకున్నారట. ఆ తబిశీళ్లు బ్రిటిష్ వారికి అమ్మి, పెద్ద ఈనాములు పొందారుట. కాని అడవి పిల్లతో పెళ్లాడడానికి వీల్లేదని తనకి ఒక కూతురుందనీ చెప్పి వచ్చేశారుట. వచ్చేసేటప్పుడు పడుచు దోసెడు నీళ్లెత్తి శపించిందిట. అదుపు ఎరుగని హోరు గాలిలో పుట్టి పెరిగిన అడవి పిల్ల. తన చుట్టూ ఉన్న అడివి పువ్వులలా, పెరిగిన పిల్ల. గాఢ విశ్వాసాలు తీవ్ర రాగ ద్వేషాలు తీర్చి దిద్దిన, కల్ల కపట మెరుగని ఆ చిన్నది మాట నిలపలేక పోయింది. అనేసింది. ఆగాధ మనోవ్యధకి తపస్సుకున్నంత తీవ్రత ఉందిగాబోలు "నీ ఇంట ఆడపిల్లలు నూరేండ్లు పుట్టరు. పుడితే పెండ్లిండ్లు కావు! పో!" అందిట. అవును. సాకేతలో ఆడపిల్లలు లేరుట. ఇప్పుడుతను పుట్టిందిట. ఏమి మూఢ నమ్మకాలబ్బ! ఈ సైంటిఫిక్ కాలంలో! What nonsense! ప్రపంచం ఇంత వృద్ధికి వచ్చాకనా ఈ నమ్మకాలు! అందులోనూ తను ఒక మెడికో డాక్టరు చదివి ఈ మాటలు! నమ్మకాలా! భలే! సిగ్గుచేటు! అని బూత్సాసు పైకి లాగుకొని ఒడ్డిగిలి, కళ్లు గట్టిగా మూసుకుని పడుకుంది చిరునవ్వుతో - నిద్ర కోసం.

ఆదివారం నాడు సూర్యోదయమైంది. సాకేతలో కిటికీల పైన, తలుపుల పైన అలంకారానికి అమిర్చి కట్టిన రంగుల అద్దాలనించీ ఉదయపు లేత సూర్య కిరణాలు లోపల హాల్లోకి పడి, గది అంతా చక్కని రంగు రంగుల వెలుగు కమ్మినట్టాంది. వరండా ఎదురుంగా ఆవరణలో ఉన్న తెల్ల గన్నేరు చెట్టు మీద రెండు కాకులు కూచుని అరుస్తూన్నాయి. మేడకి పక్కగా ఆవరణలో, చల్లటి ఎండలో మందార చెట్ల కింద ఏ పువ్వుతుంచుకుందామా అని ఆలోచిస్తూ నించుని ఉంది, బాగా అలంకరించుకున్న వసుంధర. చెట్ల ఆకు మీద నించీ వడియకట్టినట్టూ వచ్చే ఆకుపచ్చని ఎండ నున్నగా ఉన్న లేత పసుపురంగు ముఖం మీద పడి అలదికొన్నది. ఎర్రపట్టు చీర కట్టుకొని కెంపులు తాపిన గజ్జల పట్టెడ మెడలో పెట్టుకొని, వాలు జడతో ఉన్న వసుంధరని కిటికీ లోనించీ తండ్రీ కొడుకూచూచి గర్వంతో పొంగి పోయారు. ఎప్పుడూ అలసిపోయిన కళ్లూ, చిరుచెమట, కోటుతో వసుంధరని చూడడం అలవాటైన వాళ్ల కళ్లకి ఆ క్షణంలో ఆవిడ ఒక సజీవ ప్రతిమలా కనిపించింది. తన భావాలూ భాషా అణిచి పెట్టుకో గలిగిన కిశోర్, అప్పుడే వచ్చి,

"అదేమిటి? చక్కని నెక్‌లెస్ బావుంది'' అన్నాడు.

"దీన్ని గజ్జెల పట్టెడ అంటారు'' అంది చిరునవ్వుతో.

"మందార పువ్వు వద్దు, ఉండు" అంటూ, గబ గబ తన ఇంటి ముందరకి వెళ్లి ఒక ఎఱ్ఱటి గులాబి పువ్వు తెచ్చి చేతికిచ్చాడు.

"ఇదేమిటి, చేతిలో రక్తం?' అంది, వసుంధర ఆతృతగా.

"అబ్బె! ఏమీ లేదు. చెట్టు ముల్లు గీసుకు పోయింది. అంతే!'' అన్నాడు తన చేతి గుడ్డతో తుడుచుకుంటూ.

"ఉండు, ఉండు. నేను యాంటి సెప్టిక్ క్రీమ్ తెచ్చివేస్తాను.' అంటూ, ఇంట్లోకి రెండడుగులు వెయ్యంగానే "వద్దు వద్దు. లీవ్ ఇట్ టు నేచర్. సహజంగా వదిలి పెట్టేస్తే, దానంతట అదే సర్దుకుంటుంది'' అన్నాడు చిరునవ్వుతో. "బాధపడకు'' అన్నాడు తిరిగి. అంతలోకి, శశి బయటకొచ్చి, "రండ్రరా, టిఫిన్‌కి ఇహ. అసలే లేటయింది ఇవ్వేళ, బ్రెడ్ టోస్టు చేశాను, ఈవేళ కాస్తలేటుగా. రండి. రండి. పాపం పొద్దుట్నించీ ఆ రెండు కాకులూ ఓపిగ్గా గన్నేరు చెట్టు మీద కూచునే ఉన్నాయి ఫలహారం కోసం" అని పిల్చి వెళ్లాడు లోపలికి.

మాటామంచీ, చిన్న నవ్వులు వేళాకోళాలతో అమిత ఆనందంగా ఒక గంట గడిచింది. ఫలహారాలయినాయి. "ఉండండి. నేను వెళ్లి అమ్మని చూచి, అన్నీ సర్ది అమ్మకి ఏర్పాటు చేసి, అలాగే వెళ్లి టాక్సీ తెచ్చేస్తాను.'' అంటూ కిశోర్ లేచాడు.

వాకిట్లో టాక్సీ ఆగంగానే, వామనరావుగారు వరండా దిగి, గేటు వద్దకి వచ్చి, కారు తలుపు తీసి భుజంగరావుగారిని ఆహ్వానించాడు. అందర్నీ లోపలికి తీసి కెళ్ళారు. వరండాలో ఆజానుబాహుడైన యువకుడొకడు నిలబడి ఉన్నాడు - అతి నాగరికమైన నవీన రకపు దుస్తులతో.

"వీడు నా మేనల్లుడు మన్‌మోహన్. నాకు సన్నిహిత స్నేహితులు భుజంగ రావుగారు" అంటూ పరిచయాలు ఆరంభించారు. వామనరావు గారు. "Glad to meet you" అన్నాడు మోహన్ చెయ్యి ఇస్తూ. ఇదిగో నా బ్రిల్లియంటు స్టూడెంటు, "డాక్టరు వసుంధర. సాయంత్రం పండుగంతా ఈవిడ కోసమే'' అన్నారు వామనరావు. "సంతోషం చాలా సంతోషం'' అన్నాడు మోహన్ కళ్లప్పగిస్తూ.

అన్ని గౌరవాలూ అందుకున్న వసుంధరని అందరూ అభినందించడంతో వాతావరణం సంతోషంతో నిండిపోయింది.

తరువాత "ఇంట్లో మిమ్మల్నందరినీ దిగబెట్టి వస్తాపదండి కారులో" అన్నారు వామనరావుగారు. వెంటనే "ఇంత అలసిపోయావు మామయ్యా. నువ్వక్కర్లేదు. నేనే దిగబెట్టి వస్తాలే" అంటూనే కారు తలుపు తీశాడు, మోహన్. "థాంక్సు" అంటూ అందరూ కారులో కూచున్నారు. శశి దారి చూపుతూంటే, మన్‌మోహన్ సాకేత గేటు లోపలికి వచ్చి, ఛటుక్కున కారు ఆపేశాడు.

కారు ఆగి ఆగంగానే, కిశోర్ ఎగిరి దూకినట్టు దిగేశాడు. "థాంక్స్" అంటూ. "మామయ్యగారూ క్షమించాలి. రోజంతా అమ్మని ఒంటరిగా వదిలాను. నేను వెళ్లనామరి' అంటూ తన ఇంటికేసి గబ గబ నడిచేశాడు. కారు శబ్దానికి వరండాలో లైట్ల క్రింద పడుకున్న సోమాలు హడావుడిగా లేచి హాలు తలుపులు బయట నించే తెరిచి తారుకుంటూ దిగివచ్చి వసుంధర చేతిలో నించీ సామాను అందుకుంది. హాల్లో దేదీప్యంగా వెలుగుతున్న లైట్లలోనించి, వసుంధర తిన్నగా మేడ మెట్లెక్కి, తన గదిలోకి వెళ్లి పోయింది. ఎవ్వరి తోనూ మాట్లాడకుండా. తనకే తెలియని ఆనందం తన్ని ముంచెత్తి పోస్తోంది. కాని, మనస్సు నెమ్మదిగా లేదు. ఎక్కడో అంతర్యంలో తెలియని రీతి బాధ, భయమూ పీకుతున్నాయి. నాన్న ముఖంలో ఏదో దుఃఖం అలుముకుంది. అది మాత్రం అర్థమయింది. ఆయన కళ్లు ఉదయం ఉన్నట్లు లేవు. రోజంతా తనతో ఒక్క మాట కూడా మాట్లాడలేదాయన. ఆ మాటకొస్తే తన వాళ్లెవ్వరూ మాట్లాడలేదు. గుండెలు బరువుగానే ఉన్నాయి. పాలు కాచి నాన్న కిచ్చి అక్కయ్య గదిలోకి వచ్చాడు శశి. వసుంధర బట్టలు కూడా మార్చుకోకుండా మంచం మీద వెల్లికిల పడుకుని నుదుటి మీద ముంజెయ్యి ముడిచి పెట్టుకుని, ఏదో ధ్యాసగా పైకి చూస్తూంది. శశి వచ్చిన అలికిడికి దిగ్గున చూచింది, గుమ్మంకేసి. శశి చేతిలో పాలు చూచి "ఆకలిలేదురా, విందు భోజనం ఇంకా బరువుగానే ఉంది" అంది. "నీకు ఆకలి వేసినప్పుడే తాగు. చాలా వేడిగానే ఉన్నాయిలే" అంటూ పాల గ్లాసు టేబిల్‌మీద పెట్టి తలుపు నెమ్మదిగా దగ్గరగా వేసి, నిమ్మళంగా మెట్లు దిగాడు.

ఏదో అవసరమైన ముక్తసరి మాటలతో మరునాటి ఉదయం గడుస్తూంది. కిశోర్ వచ్చాడు. "మామయ్యగారూ ఆఫీస్ కెళతాను. శశీ ఏమన్నా కావాలా?"

అన్నాడు. "అక్కర్లేదు" అన్నాడు శశి. "ఇన్స్‌పెక్షన్" ఉందన్నావు గదూ. సరే వెళ్లిరా" అన్నారు భుజంగరావుగారు. కాస్సేపటికి డ్రస్ చేసుకుని బాగ్‌చేత పుచ్చుకుని మేడ మెట్లు దిగింది వసుంధర. వామనరావుగారి కారు తెరిచి ఉన్న గేటులోనించీ వచ్చి వరండా ముందర ఆగింది. కారులోనించీ గబుక్కున బయటికి దూకాడు మన్‌మోహన్.

అందరూ కాస్త ఆశ్చర్యంగా చూచారు. కాని కాస్త తెప్పరిల్లి నాగరికపు మర్యాదలతో శశి లేచి ఆహ్వానించబోయాడు. కాని మన్‌మోహన్, ముక్తసరిగా చిరునవ్వుతో "గుడ్ మోర్నింగ్ ఫోక్స్" అంటూ వసుంధరపక్కకి వెళ్లి, "రండి మిమ్మల్ని హాస్పటల్‌లో డ్రాప్ చేస్తాను" అంటూ ఆవిడ చేతిలో ఉన్న బాగ్ తీసుకున్నాడు. మంత్ర ముగ్ధలా వసుంధర అతని వెంట నడిచి వెళ్లింది. చావిట్లో ఎవ్వరూ మాట్లాడలేదు. తండ్రికీ, కొడుక్కీ గుండెలు బరువెక్కినయి. నిమ్మళంగా లేచి, భుజంగరావుగారు తన గదిలోకి నడిచారు.

ప్రతి రోజూ ఉదయాన్న మన్‌మోహన్ వచ్చి కారులో తీసికెళ్లడం, సాయంత్రం, ఊరు బయటికి షికారుగా కారులో వెళ్లడం గాలి పీల్చుకుని రాత్రి పడ్డాక ఇంటికి తిరిగి రావడం - ఇదీ వరుస. రాత్రి రాంగానే వసుంధర తిన్నగా తన గదికి వెళ్లిపోతుంది. అక్కడ శశి టేబుల్ మీద పెట్టి ఉంచిన అన్నం కాస్త నోట్లో వేసుకోడం - అదైనా మన్‌మోహన్‌తో ఎక్కువ టిఫిన్ తీసుకోకపోతే.

సాకేత మీద ఏదో మబ్బు వాలినట్టు అనిపించింది. కలకలలూ, చిన్న చిన్న మాటలు కూడా లేవు.

వామనరావుగారికీ, మేనల్లుడి నడవడి ఏ మాత్రమూ నచ్చలేదు. కాని అతిథిగా వచ్చాడు. మళ్లా తిరిగి అతను వెళ్లిపోయాక అన్నీ వాటంతటవే సర్దుకుంటాయిలే అనుకుంటూ మనస్సు నెమ్మది చేసుకున్నారు.

కాని మర్యాదలూ, సాంప్రదాయాలూ పాటించే భుజంగరావుగారికి మాత్రం ఈ పరిస్థితి చాలా దుర్భరంగానే ఉంది. ఆ మిలిటరీ పెద్ద మనిషి ఎప్పుడు తిరిగి వెళ్లిపోతాడు అని రోజులు లెక్కపెట్టుకుంటున్నారు. కూతుర్ని మందలించడానికి మనస్కరించలేదు-ప్రేమ, నమ్మకమూ, నాగరికమూ అన్నీ అడ్డు వచ్చాయి. శశి బాధలూ ఇంచు మించు అల్లాగే ఉన్నాయి. కిశోర్ మాత్రం, చిరునవ్వుతో ఆ

కుటుంబానికి తోడ్పడడమే గాని, వసుంధర మాట ఎత్తడు. ఆవిణ్ణి తప్పించుకునే తిరుగుతాడు. వసుంధరకి కూడా తనకే తెలియని బాధ మనస్సులో ఉంటూనే ఉంది. కాని తన్ని మించిన శక్తి ఏదో తనని పగ్గాలు కట్టి లాగుతున్నట్టూ, మన్‌మోహన్ వసుంధరని ఆకర్షిస్తున్నాడు. సాకేతలో ఎవ్వరికీ నెమ్మది లేదు.

ఈ సాధక బాధకాలతో ఒక పది రోజులు గడిచినయి.

ఒకనాటి సాయంత్రం, గాలి పీల్చుకోడానికి వెళుతూ, కారులో మోహన్, "నాకు ఈ వేళ ఉత్తరం వచ్చింది కంపెనీ 'పార్టనర్సు' దగ్గరనించీ. పెద్ద కార్యక్రమం ఒకటి ఆరంభించాం ఈ సంవత్సరం. 'మారిషస్‌లో ఫాక్టరీలు కడుతున్నాం. ఆ సందర్భంగా కాస్త బయటదేశాలకి వెళ్లవలసి వస్తుంది. ఆ పని అంతా నేను ఉంటేగాని జరగదు. అందువల్ల రేపు రాత్రి బయలుదేరి వెళ్తాను. నేను తిరిగి నాలుగు, అయిదు మాసాల్లో వచ్చేస్తాను. నేను నీకు వ్రాయడం లాభం లేదు. నీ కందక పోవచ్చు ఉత్తరాలు. అందువల్ల నీ సర్టిఫికెట్లు' అన్నీ తయ్యారుగా పెట్టుకో. ఛటుక్కున వచ్చి నిన్ను తీసుకుని వెళ్లిపోతాను" అన్నాడు. వసుంధర ఏమీ మాట్లాడలేదు. కారు ఒక్క క్షణం ఆగింది. మోహన్ వసుంధర ముఖం కేసి చూస్తూ, చేతులు చక్రం మీద నించీ తియ్యకుండా "నాకు ఒక్క ఆశఉంది వసుంధర, నిన్ను మొదట సారి చూచినట్టే, ఒక్కసారి నేను వెళ్లక ముందు, నిన్ను చూడాలని ఉంది. తిరిగి వచ్చేవరకూ నిన్ను అల్లాగే జ్ఞాపకం పెట్టుకుంటాను. రేపు అల్లాగే అలంకరించుకో. సరేనా?" అన్నాడు. చిరునవ్వుతో. వసుంధర మనస్సు నిండి పొంగిపోయింది.

ఆ మరునాడు సాయంత్రపు ఎండలు నీడలు లేకుండా మసకగానే ఉన్నాయి కాస్త. మన్‌మోహన్ వసుంధరతో కారులో బయలుదేరాడు. ఊరు పొలిమేర దాటింది కారు. మోహన్‌కారు ఆపి, దిగి రోడ్డు ప్రక్కన కూచోటానికి చక్కని స్థలం చూస్తున్నాడు. వసుంధర కూడా దిగి, కారుని ఆనుకుని నించుంది. ఆకాశం మీద మబ్బులు కూడుకుంటూన్నాయి. ఎండ మాయమైంది. దూరాన తోటల్లో పచ్చటి ఆకులతోనూ పువ్వుల గుత్తులతోనూ తలలూపుతున్నాయి. ఎదురుంగా పొలాల్లో పైరు మంచి ఏపు మీద ఉన్నది. మరొక పక్క దట్టంగా పెరిగిన పొదల్లో నించీ పక్షి ఒకటి గొంతెత్తి పిల్చింది. దూరాన్నించీ చిన్నగా ఇంకో పక్షి పలికింది. ఉన్నట్లుండి, ఎక్కడో పుట్టిన గాలి అల ఒకటి ఈ ప్రకృతి తరుణ శోభని ఆరగించి, మైమరచి, పక్కనే ఉన్న మొగలితోట మీదుగా, పరిమళాలతో విసురుగా

రోడ్డు మీదికి వచ్చి నించుని ఉన్న వసుంధరని ఆవరించింది. కాస్త ఆలోచించడానికి కూడా వ్యవధి దీసుకోకుండా విసురు ఎక్కువై అటూ ఇటూ కొట్టింది. ఆ విసురుకి వసుంధర పాదాల మీది నించీ ఎఱ్ఱపట్టు చీర జరీ అంచు కుచ్చెళ్లు అందంగా కొంచెం, అటూ ఇటూ ఎగరప్రారంభించినయి. దడబడ రెండు చినుకులు పడ్డాయి. "వాన వచ్చేట్టు ఉంది. కారు లోపల కూచుందాం" అంది వసుంధర.

కూచున్న తరువాత "నేను వచ్చేరోజుకు నేను చెప్పినట్లా రెడీగా ఉంటావు గదూ?" అడిగాడు. మోహన్.

"ఉంటాను" అంది వసుంధర - అదుపు అజ్ఞలతో పుట్టి పెరిగిన పిల్ల మాట ఇచ్చింది.

"వర్షం జల్లు లోపలికి కొడుతూంది, పోదాం" అంది. రోడ్డు ప్రక్కగా ఉన్న సీమతుమ్మచెట్టుకి వేళ్లాడుతున్న పాలంపిచ్చుక గూళ్లు అటూ ఇటూ ఊగిస లాడుతున్నాయి.

వర్షాన్ని, గాలినీ దూసుకుంటూ కారు సాకేత కేసి బయలు దేరింది.

ఆ రాత్రంతా ఆగి ఆగి వర్షం కురుస్తూనే ఉంది. వసుంధర అంతరాత్మలో క్షోభ ఎక్కువైంది. తనుఏదో పెద్దద్రోహం చేసిన వ్యక్తిలా అనిపించింది తనకి. ఒకవేళ తాను పెండ్లి చేసుకొని సుఖపడుతున్నాను అని తెలిస్తే నాన్నగారు క్షమిస్తారా? ఊహూ! అది వట్టి కల్ల ! మన్‌మోహన్ అంటే ఇక్కడ ఎవ్వరికీ గిట్టదు మరి. కాని అతన్ని పెండ్లిచేసుకోక తప్పదు. అతను వస్తాడు. అతనితో వెళ్లిపోవాల. ఈ ఆలోచనలతోనే తెల్లవారింది. గత పది రోజుల నించీ ఎల్లా ఉన్నాయో అలాగే గడుస్తూన్నాయి రోజులు. పెద్ద మార్పులేమీ లేవు. నాన్న ఎక్కువ సేపు కింద ఉండడం లేదు. కాని క్రమేణ మన్‌మోహన్ రావడం లేదు. తిరిగి ఊరు వెళ్లిపోయాడు అని నెమ్మది మాత్రం కలిగింది సాకేతలో అందరికి. పోను పోను వసుంధర తిరిగి ఎప్పట్లా అందరితోనూ కలిసి మెలిసి ఉంటుందిలే. ఇన్నాళ్లటికి ఆవిడ తరహా తక్కువ నడవడికి, ఆవిడే బాధపడుతూంది, అనుకుంటూ తృప్తిపడ్డారు ఎవ్వరంతటవాళ్లు, తండ్రీకొడుకూన్నూ. వసుంధర మాత్రం మనస్సాక్షి బాధతో కుమిలి పోతూంది. పూర్వపు స్వతంత్రాలు ఎంచేతనో తిరిగి రాలేదు సాకేతలో. సాయంత్రపు వేళల్లో బయట సాహిత్య గోష్ఠులు మాత్రం జరుగుతూనే ఉన్నాయి.

రోజులు గడిచాయి. వానలు తీరిపోయి నాయి. ఆఖరుకి చలికాలం కూడా వచ్చి పోయింది. పోర్టికో ముందర ఉన్న తెల్ల గన్నేరు చెట్టు ఆకులు రాల్చి మొగ్గ తొడిగింది. చిరు ఎండలు ఆరంభమైనాయి.

ఫలహారాలయ్యాక 'లౌంజి చెయిర్' లో కూచుని టి.వి. చూస్తున్నారు భుజంగరావుగారు, ఒకనాటి ఉదయం. శశి పత్రిక చదువుతున్నాడు. స్కూటర్ శబ్దం అయింది. "మామయ్య గారూ అమ్మకి మందుల కోసం వెళుతున్నాను. ఏమన్నా కావాలా బయట్నించీ, శశీ" అడిగాడు కిశోర్. "అన్నీ ఉన్నాయి కిశోర్" అన్నాడు శశి. మేడ మీద డ్రస్ చేసుకుంటున్న వసుంధరకి ఇదంతా వినిపించింది. కిశోర్ తనని ఒక్కసారి కూడా పలుకరించడం లేదు. అసలు ఎదురు పడడమే లేదు. అల్లా ఎదురు పడితే మర్యాదలేగాని ముఖం చూపించి మాట్లాడడం లేదు. తనకే తెలియకుండా మనస్సులో ఏదో బరువు పడ్డట్టు అయింది. కాని ఆ క్షణం లోనే మన్‌మోహన్ ప్రతిమ కళ్ళు కప్పేసింది. వసుంధర ప్రపంచం కదిలింది. అవునూ, అతను చెప్పిన గడువు నాళ్ళు దగ్గర బడ్డాయి. మరి ఇంకా ఏం రాలేదూ? మనస్సులో కల్లోలం లేచింది. డ్యూటీకి టైమ్ అయింది. వసుంధర తన బాగ్ పట్టుకుంది.

కింద కారు శబ్దం అయింది. మన్‌మోహన్ కారులోనించీ కిందికి దూకాడు. హాల్లో భుజంగరావుగారిని చూచి "హల్లో సార్ గుడ్ మోర్నింగ్, వసుంధర ఎక్కడ?" అంటూండంగానే, మెట్లు దిగుతున్న వసుంధరని చూచి, "హల్లో వసుంధరా, నిన్ను హాస్పిటల్‌లో దించేస్తాను, రా" అంటూ బ్యాగ్ తీసుకున్నాడు. ఆవిడ చేతిలోనించీ. "వెళ్లివస్తా నాన్నా" అంటూ నాన్న ముఖం చూడ్డానికి భయపడి, తలవంచుకుని అతని వెనకే వచ్చేసింది బయటికి. కారు ఎక్కబోతుండగా, గన్నేరు చెట్టు మీదనించీ, పువ్వు ఒకటి శబ్దం లేకుండా వసుంధర భుజం మీద రాలింది. "ఛ! వాసనలేదు. పాడు లేదు. అసహ్యంగా. అది తీసి పారెయ్యి" అన్నాడు మోహన్. అతనే అది తీసిపారేస్తూ.

వసుంధర కిటికీలోకి క్రీగంట చూచింది. హాల్లో ఎవ్వరూ లేరు.

"నా దగ్గర ఎటువంటి అపురూపమైన రోజాలు ఉన్నాయో తెలుసా, జపాన్ నించీ తెచ్చాను" అన్నాడు అతను బండి తిప్పుతూ.

కారు వేగంగా రోడ్డు ఎక్కింది.

ఆ మరునాటి సాయంత్రం పరబ్రహ్మంగారూ సుబ్బన్న గారూ చేతులు వెనక పెట్టుకుని ఏవో అచ్చట్లూ ముచ్చట్లూ ఆడుకుంటూ, ఎప్పట్లా, నిమ్మళంగా సాకేత గేటులోనించీ వరండా దగ్గరికి వచ్చారు. ఆ శబ్దానికి వరండాలోనే చీపురు పక్కగా పెట్టుకొని వడ్డిగిలి పడుక్కున్న సోమాలు ఛటుక్కున లేచి భుజం మీదికి, పవిట కొంగు లాక్కుంటూ, మెట్లు దిగి వీళ్లకి ఎదురుగా వచ్చింది. దగ్గరగా రాంగానే, ముఖం చేతులతో కప్పుకొని వెక్కివెక్కి ఏడవనారంభించింది. వెంటనే వీళ్లిద్దరూ నిలబడి పోయారు గాభరాగా.

"ఏమిటి సోమాలు? ఏం జరిగింది?" ఆతృతగా అడిగారు, సుబ్బన్నగారు.

"ఏమిటి చెప్పమ్మా" అన్నారు పరబ్రహ్మంగారు.

కాస్సేపటికి తెప్పరిల్లి, సోమాలు, "అయ్యగారికి బాగా లేదండి. ఈయాళ అబ్బాయిగారు వంట కూడా చెయ్యలేదండి!'' అంది, ముఖం మీది చేతులు పక్కకి తీసుకుని, "పడుకునే ఉండారుండి!" అంది మళ్లా.

"అయితే డాక్టరు ఏమంటారు? ఏమిటయింది వీరికి?'' అడిగారు పరబ్రహ్మం. వెంటనే "ఏం, వసుంధర ఏమన్నది? మందులిస్తోందా?'' వెంటనే అడిగారు సుబ్బన్న గాభరాగా, ఆత్రుతగా.

సోమాలు మళ్లా ఒక్క ఏడ్పు ఏడ్చి "అంతా అమ్మాయిగారల్ల వచ్చిందే గాదా బాబయ్యగారూ, ఇంత ముప్పు" అంది, ముక్కు చీదేసుకొని.

"అదేమిటి?" అన్నారు సుబ్బన్నగారు ఆత్రంగా. "అమ్మాయికి ఏమయింది? చెప్పు సోమాలూ'' గబగబా అడిగారు పరబ్రహ్మంగారు.

"అయ్యా, అమ్మాయిగారు ఆ మిలిటరీఓణ్ని పెళ్లాడతానని ఇంట్లో నించీ పారిపోయారుండి" అన్నది సోమాలు.

ఇద్దరూ ఆశ్చర్యంగా చూచారు - నమ్మలేక.

"అదేమిటి సోమాలూ, వసుంధర అల్లా ఎప్పుడూ చెయ్యదే'' అన్నారు నిమ్మళంగా, సుబ్బన్నగారు.

"అబ్బెబ్బే! ఇది నమ్మడానికి అవదమ్మా, ఇది వట్టి కట్టు కథ'' అన్నారు పరబ్రహ్మంగారు, తల అడ్డంగా ఊపుతూ.

"నీ కసలు ఇది ఎవ్వరు చెప్పారు?" అడిగారు సుబ్బన్నగారు.

"ఎవ్వలు చెప్పాలుండి. నా సొంత శెవ్వులతో నేనే ఇన్నానుండి. అబ్బాయిగారు ఆ ఉత్తరం అయ్యగారికి శదివి ఇనిపిస్తా ఉండారుండి' అంది సోమాలు గద్గద స్వరంతో.

"ఏ ఉత్తరం?" "ఉత్తరం ఏమిటి?" అడిగారు ఇద్దరూ మార్చి, మార్చి. ఇంకా ఆశ్చర్యంగా.

"అమ్మాయిగారి ఉత్తరం, అయ్యా. అమ్మాయిగారే ఒక ఉత్తరం వ్రాసి ఆంవ టేబిల్ మీదనే పెట్టి ఎల్లిపోయారండి. పొద్దున్న అబ్బాయిగారు కాఫీ తీసికెల్తే, అమ్మాయిగారి గదిలోకి, ఆ ఉత్తరం ఉందంట. ఆ మడిశిని చూస్తే నాకు అరికాలులో మండి నడినెత్తికి ఎల్తాదండీ. కీడు పురుగు శేరినట్టు శేరాడు గదండి బాబయ్యా" అంది సోమాలు కళ్లు తుడుచుకుంటూ. పరబ్రహ్మంగారు దిగులుగా సాకేత కేసి చూస్తూ "ఎప్పటికి ఏమో గదా" అన్నారు వినీ వినబడకుండా. "ఎంత చిత్రం జరిగింది?" అన్నారు సుబ్బన్నగారు. "ఈ వయస్సులో పాపం భుజంగరావు గారికి ఈ విధంగా జరగకూడదు. సోమాలూ దిగులుపడకు. అన్నీ సరిపోతాయి. భగవంతుడున్నాడు'' అన్నారు శాంతంగా పరబ్రహ్మంగారు. " కాని ఇది ఎవ్వరి తోనూ నువ్వు నోరు జారవద్దు'' హెచ్చరించారు.

"నేనెందుకు నోరు తెరుస్తానండయ్యా, మీతో గనక అన్నాను'' అంది సోమాలు.

గేటులోనించీ రాధాక్రిష్ణగారూ, అనంత రామయ్యగారూ రావడం చూచి, సుబ్బన్నగారు పరబ్రహ్మంగారూ ఎదురెళ్లి "పదండి ఈవేళ వారికి బాగాలేదు'' అంటూ అందరూ బయటికి నడిచారు. సోమాలు నిమ్మళంగా చీపురు అందుకుంది, సందె వాకిళ్లు ఊడవడానికి.

అక్కడ, గోపాలపురం చేరేటప్పటికి సందెవేళ అయింది. టాక్సీ అంత దూరాన్న ఉండంగానే గేటు కావలి వాడు తొందర తొందరగా గేటు సొంతంగా తెరిచేశాడు. బంగళా లోపల్నించీ ఒక అరవై ఏండ్ల పనిమనిషి, సామాన్లన్నీ దించి లోపలికి తీసి కెళ్లాడు. కాంపౌండు నిండా రకరకాల పువ్వులు తలలూపుతున్నాయి. చుట్టూ ఎత్తైన గోడలూ, గోడలపైన ఇనప చువ్వల కటకటాలూ ఉన్నాయి. అబ్బ, ఎంత బలంగా కండలు తేరి ఉన్నాడో ఈ గేటు కావలివాడు. ఈ ఉద్యోగం ఏం ఖర్మం! ఏదయినా

దుంగలు ఎత్తి బ్రతక వచ్చుగా అనుకుంది, వసుంధర. "లెటస్ గో ఇన్ డార్లింగ్" అంటూ లోపలికి దారి తీశాడు. మన్‌మోహన్ ఇల్లు పొలాల్లో కట్టినట్టుంది. చుట్టూ ఊరు లేదు, ఏవేవో ఆకు తోటలు ఉన్నాయి.

లోపలికి వెళ్లంగానే హాల్లో ఫేన్లు తిరుగుతూన్నాయి. ఒక పక్కన టీపాయ్ టేబిల్ మీద టీ సెట్‌పెట్టి ఉంది టీ ట్రేలో. మన్‌మోహన్ టై విప్పేసి కోటు తీసేసి కుర్చీ లాగుకొని కూచున్నాడు "కూచో" అని కుర్చీ చూపిస్తూ, అతనే టీ పోసి కలిపి, ఒక కప్పు వసుంధర చేతికిచ్చాడు తనూ ఒక కప్పు తీసుకుంటూ. ఇద్దరూ తాగాక "మోర్ టీ?" అడిగాడు. "అక్కర్లేదు, థాంక్సు చాలా రిఫ్రెషింగ్‌గా ఉంది" అన్నది.

"అప్పలస్వామీ, రేపు ఎవ్వరినైనా ఒక ఆడ పనిమనిషిని తీసుకురా ఉళ్లోనించి" అన్నాడు మోహన్.

"అల్లాగే చిన్నయ్యా" అన్నాడు పనిమనిషి అప్పలస్వామి గుమ్మంలోనించే.

"నువ్వు స్నానం చేసి బట్టలు మార్చుకో. నేను బాత్‌రూమ్ చూపిస్తాను. ఏది ఆ ట్రావిలింగ్ బాగ్, అందులో ఒరిజినల్ సర్టిఫికెట్సు ఉన్నయ్యి అన్నావు గదా. నేను భద్రంగా దాస్తాను" అంటూనే బాగ్ తీసుకొని తన గదిలోకి వెళ్లి తన బీరువాలో పెట్టి బీగం వేసేసాడు.

ఆ రాత్రి టి.వి. చూస్తూంటే "భోజనాలు రెడీగా ఉందయ్యా" అన్నాడు అప్పలస్వామి - ముభావంగా. "కమ్ ఆన్ డియర్" అంటూ డైనింగ్ రూమ్‌లోకి నడిచాడు. మామిడి పళ్లతో ఫ్రూట్ సాలెడ్‌తో అతి అద్భుతంగా ఉంది. భోజనాలన్నీ పెద్ద హోల్లోనించి వచ్చినవే లాగుంది. తరువాత వసుంధర తనకి చూపించిన గదిలో పండుకుంది - బడలికగా.

కాని నిద్ర రావడం లేదు. నాన్న, తమ్ముడూ, సాకేత, తన చిన్నతనం అన్ని జ్ఞాపకాలూ తన కళ్ల ముందర తిరగనారంభించాయి. బడలిక వల్ల కళ్లు మూతలు పడుతున్నాయి. ఒక పక్క. గుండెల్లో బరువైన ఆలోచనలు మనస్సులో తిరగసాగినాయి. ఉన్నట్టుండి ఏవేవో అలికిడులు వినిపించినాయి. ఎక్కడ? చెవులు ఒప్పగించింది. కొత్త ఊరాయిరి. అవును. హాల్లో నించే. మన్‌మోహన్ గొంతు అది. "అసలు నా విషయాలన్నింటిలోనూ ఎందుకిల్లా పూసుకుంటావు నివ్వు? నీ సలహాలు ఎవ్వరడిగారు?" అన్నాడు కాస్త కోపంగానూ, గట్టిగానూ.

"నువ్వు అడగాలా, చిన్నయ్యా? నువ్వు శెడిపోతావుంటే సూళ్లేక" అంది రెండో గొంతు. అప్పలస్వామిది లాగుంది. గట్టిగా మాట్లాడుతున్నాడే! "ఇన్నాళ్లా ఏ ఆడోళ్లని తెచ్చినా ఇనవు గదా అని కన్ను కానకుండానే ఊర్కున్నాను. దేనికైనా ఒక లిమిటు ఉండాలయ్యా. ఈయమ్మ పెద్దింటి పిల్లల్లె ఉండాది. అందర్నీ చేసినట్లు ఈ యమ్మని గనక నువ్వు అన్యాయం చేశావో నీకు ఇక వణ్ణం దొరకదయ్యా" అన్నది రెండో గొంతు మళ్లీ.

"నోరుముయ్యి!"

"ఇన్నాళ్లా చేసిన పని అదే నేను."

"నీ సొమ్ము ఏంబోయింది. తింటుంది ఉంటుంది. ఇంతకీ ఇది డాక్టరు పాసు అయింది బాగా సంపాదిస్తుంది. నేనేమీ అంత తెలివి తక్కువ వాణ్నేమీ కాను. ఇంకో బోటల్ తెరిచి పెట్టు. ఇక నీవు పోయి పడుకో. ఏదో చిన్నప్పట్నించి నన్ను ఎత్తుకు పెంచావు గనక గాని, ఇదే ఇంకొకళ్లు అంటే తెలిసేది మజా! ఫో!" అన్నది మోహన్ గొంతు.

వసుంధరకి అన్నీ వినిపించినాయి. సరిగా మాటలు ఇదమిత్థం అని తెలియటం లేదు. కాని ఛటుక్కున లేచి కూచుంది. 'డాక్టరు' అన్నమాట ఉంది. ఏదయితే ఏం! రేపు చూద్దాం. తల పగిలిపోతున్నట్టుగా ఉంది. నిద్రకావాలి అనుకుంది. ప్రొద్దు పొడవక ముందు కాస్త నిద్ర పట్టింది, బడలికాయిరి మరి.

తలుపు కొట్టి లోపలి కొచ్చాడు అప్పలస్వామి. చేతిలో ఉన్న ట్రే సైడ్ టేబిల్ మీద పెట్టి "బెడ్ కాఫీ అండి అమ్మగారు" అని వెళ్లిపోయాడు. రాత్రి తను ఆ మాటలు విన్నదా! భ్రమా! ఏమిటో, తలనొప్పిలో ఏమీ తెలియడం లేదు. బాత్ రూమ్‌లో ముఖం కడుక్కొని వచ్చి కాఫీ తాగింది. తిరిగి పడుకుంది. బడలిక వల్ల, విశ్రాంతి కోసం. ఒక రెండు గంటలు టైమ్ దాటాక మన్‌మోహన్ గదిలోకి వచ్చాడు "రా డియర్, స్నానం చెయ్యి. టిఫెన్ వచ్చేసింది. లేస్తావా, లేవదీయనా?" అన్నాడు చిరునవ్వుతో.

"అక్కర్లేదు" అంది లేస్తూ.

పూరీలు, ఉల్లిగడ్డల కూరా, ఆరెంజి జ్యూస్, కాఫీ రెడీగా పెట్టి ఉన్నాయి. అన్నీ తనకి ఇష్టమైనవే. అయినా ఏవేవో జ్ఞాపకాలు వచ్చినయి. ఇంకో పూరీ తిను

అని వడ్డించేవాడు శశి. ఇప్పుడు ఎల్లా ఉన్నాడో! కాస్త మనస్సులో బరువు అనిపించింది. ఇంకా వచ్చే జ్ఞాపకాలన్నీ తప్పించుకుంది.

ఒక గంట దాటాక, ట్రిమ్‌గా డ్రెస్ చేసుకొని, మన్‌మోహన్, "నేను ఒక రెండు గంటల్లో వస్తాను" అని చెప్పి గారేజ్‌లోనించీ తన కారు తీసుకొని వెళ్లిపోయాడు.

చేసేది ఏమీ లేక, వసుంధర కిటికీ దగ్గర నిలబడి బయటికి చూసింది కాస్సేపు. బయట అంతా నిర్మానుష్యం, నిశ్శబ్దం. ఇండ్లు లేవు. ముందర వేపు తోటలున్నాయి. అందువల్ల ఊరు కనబడడం లేదు. మళ్లా వచ్చి టేబిల్ మీద మేగజయిన్లు తీసి తిరగేసింది. అన్నీ వ్యాపార విషయాలే ఉన్నాయి. మళ్లా పండుకుంది. కాస్సేపాగి వసుంధర వరండాలోకి వచ్చింది. అపుడే సైకిల్‌కి కారియర్ అన్నం కట్టుకుని వచ్చిన బడలికతో, తల గోకుకుంటూ కూచుని ఉన్నాడు అప్పలస్వామి, వసుంధర పలకరించింది.

"అయ్యగారు ఇంకా రాలేదా?" అడిగింది. గబుక్కున లేచి "లేదండి అమ్మగారు" అన్నాడు, అప్పలస్వామి మర్యాదగా.

"ఎక్కడికి వెళ్లారు?" అడిగింది, తిరిగి –

"ఇంటి కండి" అన్నాడు.

"ఇల్లెక్కడ? ఇది కాదా వారి ఇల్లు?" తిరిగి అడిగింది.

"తొందర పడకండమ్మా ఉండగా ఉండగా ఊరు భోగట్టా పోగా పోగా బాట భోగట్టా తెలుసుద్దంటారు గిందా, పెద్దలు. అరుగో అయ్యగారు రానే ఒచ్చేసారు" అంటూ గేటు దగ్గరికి పరిగెట్టి చేతిలో ఉన్న సూట్ కేస్ అందుకున్నాడు, అప్పలస్వామి. మన్‌మోహన్ చక చకా వరండా ఎక్కుతూ వసుంధర బుగ్గ మీద వేలుతో మీటి, "సారీ డార్లింగ్ ఎదురు చూడకుండా ప్రయాణం వచ్చింది. హాంకాంగ్ వెళ్లాలి, పదిరోజుల కంటే ఎక్కువ పట్టదు. భోజనం పెట్టు అప్పలస్వామీ. నేను భోజనం చేసేసాను" అంటూ తన గదిలోకి వెళ్లిపోయాడు.

వసుంధర మనస్సు చివ్వుమన్నది. నోట మాట రాలేదు. తన గదిలోకి వెళ్లి పోయింది. అప్పలస్వామి వెనకే వచ్చి కేరియర్ కంచమూ నీళ్లా పెట్టి "వడ్డించనా

అమ్మగారు?'' అడిగాడు. "అక్కర్లేదు, నేనే వడ్డించుకుంటాలే, నువ్వు వెళ్లి అయ్యగారి పని చూసుకో'' అంది. తరువాత గెడ్డం కింద చేతులు పెట్టుకుని అల్లాగే కూచునే ఉండి పోయింది.

ఒక గంట సేపయ్యాక ప్రయాణానికి తయారుగా మోహన్ తలుపు గబుక్కున తెరుచుకుని, లోపలికి వచ్చి, వసుంధర ప్రక్కన కూచో బట్టాడు, భుజం మీద చెయ్యి వేస్తూ "హాంకాంగ్‌నించీ వచ్చేటప్పుడు నీకు మంచిపచ్చలు తెస్తా. అక్కడ నాకు ఒక డీలర్ తెలుసు. నాకు ప్రాణస్నేహితుడు....'' అంటూండగానే "నాకేమీ అక్కర్లేదు" అంది శాంతంగా వసుంధర. బయట అప్పలస్వామి దగ్గాడు. "ప్లేన్‌కి టైమ్ అయింది. నా ఇష్టమయింది తెస్తానులే'' అంటూ లేచాడు.

"ఇంతలో తిరిగి ప్రయాణాలు లేవులే. ఏమిటి ఇంకా భోంచెయ్యలా?" అన్నాడు, కారియర్ చూచి. వెళ్లేటపుడు "భద్రంగా ఉండు" అన్నాడు తిరిగి. "ఇంకా ఆకలి లేదు" అంటూ కూడా వరండాలోకి వచ్చింది. గేటులోనించీ టాక్సీ వచ్చింది. "టా!టా!'' చెపుతూ చిరునవ్వుతో బండి ఎక్కాడు మోహన్. "అమ్మగారిని భద్రంగా చూసుకో అప్పల స్వామి" అని అంటూ.

నిమ్మళంగా వసుంధర తనగదిలోకి వచ్చేసింది. రెండు నిమిషాల తరువాత వంగి వంగి చూస్తూ, అప్పల స్వామి. "అన్నం ముట్టనే లేదండి అమ్మగారు,'' అన్నాడు. "తినబుద్ధి కాలేదయ్యా, నేనే నీతో కొంచం మాట్లాడనా'' అడిగింది, వసుంధర. "నేనూ మాట్లాడాలనే వచ్చానండి" అన్నాడతను. "ఇలా తలుపు దగ్గర కూచోరా, నా కిద్దంతా అయోమయంగా ఉంది'' అంది, తిరిగి.

"ఏంటీ, అయోమయం లేదండి అమ్మగారు. ఈ మడిశి నల్లరాయిని కూడా కరిగించేత్తారండి. ఇషయం తెల్సాక మీరు తిరిగి ఎల్లిపోటం మంచిదండి'' అంటున్నాడు.

తిరిగి ఎక్కడికి వెళ్లిపోవడం ? అనుకుంది మనస్సులో. కళ్లలో నీళ్లు తిరిగినయి. తలలో ఏదో కొట్టినట్టుగా ఉంది వసుంధరకి.

"మీరు నమ్మి వచ్చారండి నేను కూడా ఈ మనిషిని వదిలేసి పోవాలనే ఉందండి. నాకు మీ వయస్సున్న కూతురు ఉందండి - అల్లుడు మిల్లులో పని చేస్తా ఉండాడుండి" అంటూనే ఉన్నాడు. వసుంధరకి నోట మాట రాలేదు.

"ఈగేటోణ్ణి నమ్మటానికి లేదండి. మిమ్మల్ని ఏదోఒకవిధంగాకాపాడి తప్పించి పంపెయ్యమని చెప్పారుండి. నేను ఎప్పుడిదీపుడు అమ్మగారితో శెప్తానే ఉండాను. గేటుఓన్ని పనిమీద ఇంట్లో నిలుపుతాను. టికెట్లుకి డబ్బు కూడా ఇస్తాను. మారుతాళాలుండయ్యి గదా. అయమ్మాయి సర్టిఫికెట్‌కూడా తీసి ఇయ్యి అంటాండా రుండి, అమ్మగారు" ఇంకా చెపుతున్నాడు.

వసుంధరకి, తలకొడుతూంది. మాటలు రావడం లేదు.

"అమ్మగారూ, ఈ మనిషికి మంచిగుణం ఈ జన్మకి రాదండి. బమ్మదేవుడు కూడా తిప్పలేడు ఈ మడిశి గుణం. అందుకనే అమ్మగారు బుద్ధి చెప్పటం ఒదిలేశారుండి." అన్నాడు తిరిగి. ఈ మడిశి 'తైతక్క' అన్నీ రాయమ్మగారి డబ్బేనండి. అమ్మగారు మీరు ఎళ్లేటపుడు నన్ను విశాఖలో దింపెయ్యండి. అక్కణ్ణించే బస్సు ఉండాది నాకు...." ఇంకా చెపుతున్నాడు అప్పలస్వామి.

వసుంధర కాస్తతెప్పరిల్లి, "అంత గారాబంగా పెంచారన్న మాట, ఆయమ్మ కొడుకిని?" అంది ఆర్చుకుపోయిన పెదిమలు తడుపుకుంటూ, సాలోచనగా.

"అయ్యో తల్లీ, ఈ మడిశికి తల్లి శిన్నపుడే చచ్చిపోయారుండీ. నేనేది ఆయన భార్య. సీతమ్మ తల్లిలాంటిదండి." అన్నాడు అప్పల స్వామి.

"భార్యా!" అంది ఆశ్చర్యంగా వసుంధర. తన కాళ్ల కింద భూమి బద్దలయినట్లు అయింది. వెంటనే ముఖం చేతులతో కలుపుకుని వెక్కివెక్కి ఏడవ నారంభించింది, తనలోతానే, శబ్దం బయటికి రాకుండా.

"ఈ మాటలు కూడా శెప్పలేదండి, మీతో ఈ పాపిష్టిఓడు, అయ్యో తల్లీ!" అంటూ లేచి, గబగబ హాల్లోంచి కూడా బయటికి వచ్చేసాడు, మనస్సు బాధతో.

ఇంతగా తానుదిగజారిపోయినందుకు, తనమీద తనకే అసహ్యంవేసింది. తనని తానే మన్నించుకోలేకపోయింది. దారీ తెన్నూ తోచలేదు వసుంధరకి, దుఃఖం పొంగుకుని వస్తోంది.

'టీ' వేళ అయ్యేటప్పటికి అప్పలస్వామి సైకిల్‌లో టిఫెన్, టీ తెచ్చి హాల్లో టీపాయ్ మీద పెట్టాడు. ఈ అలికిడికి వసుంధర బయటికి వచ్చింది. కళ్లూ ముఖమూ ఎర్రబడి వాచి ఉన్నాయి.

"అప్పల స్వామీ, ఈ ఉత్తరం వెంటనే స్పీడ్ పోస్టులో వెయ్యగలవా?" అంది ఉత్తరం అందిస్తూ.

"అదెంత పనండి అమ్మగారు, తెండి. ముందర ఈ టీ తాగండి. ఇది నా కాసుతో తెచ్చాను. మీరు ఉన్నన్నాళ్లు భోజనమూ టిఫిన్ నాకాసుతోనే తెచ్చి ఇస్తాను. నాకంతా అర్థం అయిందండి.'' అన్నాడు. "ఆమాత్రం డబ్బు నా దగ్గర ఉందిలే'' అంది వసుంధర. "ఎంతపనిచేసారు!'' అన్నాడు కోపంగా. "ఇంకా అతని మాటెందుకు, మనకి" అంది వసుంధర, ఏవిధమైనా బాధా చూపకుండా.

అయిదు రోజులు ఎట్లా గడిచాయో గడిచినయి. ఆరవరోజు, అప్పలస్వామి ఊళ్లోనించి వస్తూ, "అమ్మగారు, ఈ కవరు మీ చేతికి ఇమ్మన్నారండి. ఆంవ పేరుతో వచ్చిందట" అని చొక్కాయి లోపల జేబులోనించి ఒక కవరు తీసి చేతికిచ్చాడు. వసుంధర అది చింది చూచింది. దానిలో **4,000** రూపాయలకు ఒక డి.డి.న్నూ, రెండు ఉత్తరాలు ఉన్నాయి. మొదటిది చదివింది.

"చిరంజీవి వసుంధరకి ఆశీర్వాదాలు.

నీకు జరిగిన ఆపదకి నేనుకూడా సగం కారణం. మోహన్ విషయం మొదట్లోనే అన్నీ నీకు చెప్పకపోవడం నా తప్పు. అయితే ఇంత జరుగుతుందని అనుకోలేదు నేను. నేను నిన్ను వెతుక్కుంటూ రావాలనుకుంటున్నాను. నీ ఉత్తరం నా మనోభారాన్ని కొంత తగ్గించింది. నేను మీ నాన్నగారికి గర్భ శత్రువయ్యాను. వారి ముఖం ఇంత వరకూ నేను చూడలేదు.

నేను వచ్చి వాడికి తగిన శాస్తి చేస్తాను. వాడి భార్య రవణమ్మతో మాట్లాడాలి. ఇక్కడ నీవు వదిలి పెట్టిన ఉద్యోగం ఖాళీగానే ఉంది. కాని నువ్వు తిరిగి ఇక్కడికి రావడం కలలో వార్త. నేనుగాని నువ్వుగాని తిరిగి సాకేతలో కాలుపెట్టలేము. ప్రొద్దున్న మద్రాసునించి, నా ఫ్రెండ్ డాక్టరు, సోలోమన్‌రాజు గారు ఒక మంచి అసిస్టెంటు కోసం ఫోన్ చేశారు. నీ ఉత్తరం వచ్చాక, నిన్ను పంపిస్తున్నానని, తిరిగి ఫోన్ చేశాను. అతనికి నిన్ను పరిచయం చేస్తూ రాసిన ఉత్తరం కూడా నీకు పంపిస్తున్నాను. నువ్వు తిన్నగా మద్రాసు వెళ్లి సైంట్ మార్గరేట్ లేడీస్ హాస్టల్‌లో దిగు. నేను కూడా వీలు చూచుకుని మద్రాసు వస్తాను. భయపడకు. డబ్బు చాలకపోతే నాకు రాయి తల్లీ, ఏది ఎలా చెయ్యాలో రవణమ్మకి రాశాను" ప్రేమతో

వామనరావు

"పి.యస్. రిజర్వేషన్ కోసం ఆగ వద్దు. మరుక్షణం మద్రాసు బయలుదేరు. ఈ జరిగిన ఆపద వల్ల నీవు ఇంత మారతావనుకోలేదు."

వసుంధరకి దారి కనిపించింది.

ఆ రాత్రి రెండు జాములు దాటి పోయింది. బండిలో సీటులోనే తన పెట్టె మీద ఒరిగి పడుకుని నిద్రపోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తోంది. నిద్ర మాత్రం రావడం లేదు. అప్పలస్వామి విశాఖలో దిగేశాడు. దిగేటప్పుడు పక్క వాళ్లకి ఒప్ప చెప్పి మరీ దిగాడు. పైగా "కొంచెం నెమ్మదిగా నిద్రపోతల్లీ, దేముడే ఉండాడు నీకు దిక్కు, నా అడ్రసు భద్రం. ఏ అవసరానికైనా" అంటూ దిగులుగా మరీ వెళ్లాడు.

ఇంకో గంటలో బండి రాయులూరు స్టేషన్ మీది నించి వెళుతుంది. రాయులూరు తను పుట్టి పెరిగిన ఊరు! తను పేరు ప్రతిష్ఠలు సంపాదించిన ఊరు! పైగా స్టేషన్‌కి ఎదురుగానే ఉంది 'సాకేత! తన బాల్యం అంతా – తన జీవిత మంతా గడిపిన ఇల్లు! అబ్బ ! ఆలోచనలు. దైవానుగ్రహం రాత్రి అయ్యింది! ఎవ్వరి కంటా పడకుండా వెళ్లిపోవచ్చు! సాకేత మీదుగా పోవడం ఇదే ఆఖరు సారి. మళ్లా ఈ దారికి తను ఎందుకు వస్తుంది? గుండె గబగబ కొట్టుకుంది. తనని తానే క్షమించుకోలేనప్పుడు, నాన్న ఎలా క్షమిస్తారు ?

ఎవ్వరో కిటికీ తలుపులు మూసేశారు, తన భార్య కంట్లో బొగ్గుపడ్డదని. అదీ మంచిదే అనుకుంది వసుంధర. ఇంకో గంటలో తన ఊరు దాటి పోతుంది బండి. తను ఒక అనాథలాగ తన వాళ్లనందరినీ విడిచి వెళ్లిపోతున్నట్టు అనిపించింది. గుండెలు బరువెక్కినాయి. కళ్లు గట్టిగా మూసుకుంది.

ఉన్నట్టుండి బండి ఒక కేకవేసి నిమ్మళంగా నడిచి ఆగింది. పక్కాయన తలుపులు ఎత్తేశాడు. "పాపం ఆవిడగారు ఎంతో దూరం వెళ్లాలి. ఇంత ఉక్క పోస్తూంటే ఎల్లా నిద్రపోతారూ?" అంటూ వసుంధరని ఉద్దేశించి.

వసుంధర కళ్లు తెరిచింది. ఎదురుగా రాయులూరు అని వ్రాసిన బోర్డు లైట్ల వెలుగులో కళ్లల్లో బడ్డది. గుండెలు గబుక్కుమన్నాయి. ఇహనైనా కళ్లెత్తకూడదను కుంది. కాని అప్రయత్నంగా పైకి చూచింది ఏది చూడకుండా వెళ్లిపోదామనుకుందో, అదే కనిపించింది. 'సాకేత' చీకట్లో – కాదు, వెలుగులో కనిపించింది.

అదేమిటి? నాన్నగారి గదిలో అన్ని లైట్లు వెలుగుతున్నాయి. తెల్లవారుజాము మూడుగంటలకి! లేచి రైలు కిటికీలో తలపెట్టుకుని చూస్తోంది, వంగి. పోర్టికో ముందర ఉన్న తెల్ల గన్నేరు చెట్టునించి రెండు పువ్వులు శబ్దం లేకుండా కిందికి రాలి పడ్డాయి. శశి, అదిగో పక్కన డాక్టరు రాఘవయ్యగారు, ఇద్దరూ పైన పోర్టికోలోకి వస్తున్నారే! నాన్న గదిలోనించే! శశి ముఖం ఎందుకో దిగులుగా వుంది. అంత దుఃఖంగా ఉందే! "శశీ ఫరవాలేదురా నేనున్నాను" అనబోయింది తనకే తెలియకుండా; ఛటుక్కున, పరువుకీ సిగ్గుకీ భయపడి తన బాధ్యతలు వదిలి పిరికి పందలా చీకటి చాటుగా తప్పించుకు పోతున్నానా అనిపించింది, మనస్సులో వసుంధరకి. నాన్నకి ఎంత జబ్బు చెయ్యకపోతే స్పెషలిస్టు వస్తాడు. ఏమైనా సరే నాన్నకి తెలియకుండా తలమరుగుగా ఉండైనా సరే నాన్ననీ శశిని కాపాడాలి. అది తన కర్తవ్యం. ఎక్కడలేని ధైర్యం వచ్చింది, తనకి. గార్డు పచ్చ జెండా తియ్యబోతుండ' గానే, "కాస్త అర్జంటు పని" అని పక్కాయన ప్రశ్నకి సమాధానం చెబుతూ, సామాన్లు దించేసి తనూ దూకేసింది కిందికి.

వీధి దీపాల వెలుగుతో చకచక నడుచుకుంటూ తన ఇల్లు చేరింది. ఇంకా గేటు ముందర డాక్టరు గారి కారు ఉంది. డాక్టరుగారు వెళ్లాక లోపలి కెళదామని, గేటుకి బయట పక్కగా ఉన్న మర్రిచెట్టు కింద నుంచుంది, మరుగ్గా. ఒక్క నిమిషంలో శశీ, డాక్టరుగారూ బయటికి వచ్చారు. డాక్టరుగారు కారు ఎక్కబోతూ "నువ్వు ఇల్లా ఉంటేనే ఆరోగ్యం బాగా దెబ్బ తింటుంది. మీ నాన్నగారు నిద్రపోయినప్పుడైనా నీవు కాస్త రెస్టు తీసుకోవాలి మరి. వారికి మానసికంగా ఒక షాక్. అది ఎక్కువగా ఉంది. ఇంత వచ్చి ఉండదు, మీ అక్కయ్య ఈ గేటు దాటకుండా ఉన్నట్టయితే, చూద్దాం గాడ్ ఈస్ గ్రేట్! గుడ్ నైట్" అన్నారు. కారు కదిలింది. ఏదో నిద్దట్లో నడిచేవాళ్లలా, శశి గేటు నిమ్మళంగా మూస్తున్నాడు. గేటు పైన గొళ్లెం వెయ్యబోతుంటే తన చేతి మీద ఏదో ఇంకో చెయ్యిపడ్డది. శశి ఉలిక్కి పడ్డాడు.

"ఎవరు?" అన్నాడు శశి, వెంటనే, గాబరాగా.

"శశీ, నేనేరా, అక్కయ్యని భయపడకు" అంటూ గేటు తెరచుకుని లోపలికి వస్తూ "మళ్లా ఈ గేటు దాటనురా ఇహను" అంది వసుంధర.

"అక్కయ్యా, ఏం, ఎందుకొచ్చావు? ఎప్పుడు వచ్చావు? ఎల్లా వచ్చావు?"

ప్రశ్నల మీద ప్రశ్నలు వేశాడు శశి, ఇంకా తెప్పరిల్ల లేక.

వసుంధర తిరిగి తమ్ముడి చెయ్యి పట్టుకుని, "రా, పద లోపలికి" అంది. సామాన్లు పట్టుకుని అక్కాతమ్ముడూ లోపలికి వెళుతూంటే, "నేను పెండ్లి చేసుకోలేదురా. ఒంటరిగానే వచ్చాను'' అంది తిరిగి.

''నాన్నకి ఏమి మందులిస్తున్నారు ఆయన?'' అడిగింది. జేబులోనించీ కాగితం తీసి ఇచ్చాడు. శశి పైనించి పడే లైట్లల్లో చదివి, "చాలా మంచి మందులురా, ఇవి. కాని, చాలా వెల'' అంది వరండా ఎక్కుతూ. ఒక్క క్షణం ఆగి, వసుంధర అడగలేక అడగలేక నిమ్మళంగా ''అవును శశి.... ఇప్పుడు... ఇంత ఒంటరిగా ఉన్నావే, వీటికంతా... దీనికంతా, ఎవరు సహాయం చేస్తున్నారు?" అని – తిరిగి.

''ఇంకెవ్వరక్కయ్యా, మన కిశోరే! డాక్టర్ని ఏర్పాటు చేసింది కూడా కిశోరే'' అన్నాడు.

వసుంధర, అప్రయత్నంగా తలవంచి రెండు చేతులు పైకెత్తి జోడించి నమస్కరించింది – కిశోర్‌కో, దేవుళ్లకో, శశికి తెలియలేదు. కాని అక్కయ్య చాలా మారింది అని మాత్రం తెలిసింది.

ఇద్దరూ మేడ మెట్లు, శబ్దం లేకుండా ఎక్కి పై బాల్కనీలోకి వెళ్లారు. వసుంధర బాగ్‌లు కింద పెట్టి స్తంభాన్ని ఆనుకుని, కాళ్లు పొడుగ్గా నేలమీద చాపుకుని కూర్చుంది. శశి ఎదురుగా కూచుని, "అక్కా! నీతో చెప్పి తీరాలి. చాలా కష్టమైన విషయం...." అని ఆరంభించాడు "చెప్పరా, శశి" అంది అక్క. "మనం ఇంకో నెలలో మన ఇల్లు 'సాకేత' వదిలి వెళ్లిపోవాలి!" అన్నాడు. "ఏం? ఎందువల్ల?" అడిగింది గాబరాగా, ఆశ్చర్యంతో. "నాన్న మనకు చెప్పలేదుట. మన చదువులకి డబ్బులేక, మన ఇల్లు బ్యాంకుకి తాకట్టు పెట్టారుట. నువ్వు వెళ్లిపోయినట్లు తెలిసింది వాళ్ళకి. ఇల్లు జప్తుకి తెచ్చారు'' అన్నాడు మనస్సు బాధతో. వసుంధర నోట మాట రాలేదు. శశి అక్కకాళ్ల మీద తలపెట్టి నేల మీద పడుకున్నాడు. కళ్లు మూతలు పడుతున్నాయి వాళ్లకే తెలియకుండా.

మరి కాస్సేపట్లో కిశోర్ కాఫీలు, పాలు, గంజి పట్టుకుని శబ్దం చెయ్యకుండా పైకి ఎక్కి బాల్కనీలోకి వచ్చాడు. పడుకుని ఉన్న అక్కా తమ్ముళ్లని చూచి నివ్వెర పోయాడు. తన కళ్లు తానే నమ్మలేకపోయాడు. తను ఏమనుకోవాలో తనకే తెలియ

లేదు. అతను ఫ్లాస్క్ కింద పెట్టిన శబ్దానికి ఇద్దరూ కళ్లు తెరిచారు. శశి అక్క కాళ్ల మీద నించి లేస్తూ "అక్కయ్యా, కిశోర్ వచ్చేశాడు. కాఫీలు వచ్చినాయి. నువ్వు తొందరగా వెళ్లి సింకులో మొఖం కడుక్కునిరా లే" అన్నాడు. వసుంధర లేచి తన బాగ్‌లోనించి బ్రష్, పేస్టూ తీసుకుని వెళ్లింది ఏవేవో ఆలోచనలలో. కిశోర్ లేచి పక్కన వరండాలో ఉన్న షెల్ఫ్‌లోనించి, మూడు కప్పులు, సాసర్లూ తెచ్చి కింద పెట్టాడు.

"కిశోర్, అక్కయ్యకి పెండ్లి కాలేదుట. మళ్లీ తిరిగి వెళ్లననేసింది" అన్నాడు, శశి కళ్లు నులుముకుంటూ.

కిశోర్ జవాబు చెప్పకుండానే మూడు కప్పులలోనూ కాఫీ పోశాడు. వచ్చి, ముఖం తుడుచుకుంటూ నించున్న వసుంధరకేసి, కాస్త తల తిప్పి, "ఇది ఇచ్చెయ్యి" అన్నాడు కిశోర్, ఒక కప్పు పట్టుకుని, శశిని చూస్తూ, "ఫరవాలేదు. నువ్వే ఇయ్యి". అంటూ, శశి తను ఒక కప్పు తీసుకున్నాడు. అంతలోనే, తనే వంగి ఆ కప్పు సాసరు కిశోర్ చేతిలోనించి తీసుకుంది, వసుంధర.

ముగ్గురూ సావకాశంగా కాఫీలు తాగుతున్నారు.

అంతలో వసుంధర దించిన కళ్లు పైకి ఎత్తకుండానే, భయం భయంగా, "కిశోర్ నేను సాకేతలో ఉండడానికి వీలుండదు గదా... అందువల్ల మీ ఇంట్లో ఉండనా? - నాన్నకి తెలియనివ్వకుండా - నన్ను ఉండనిస్తావా?" అడిగింది, బ్రతిమాలినట్టు.

"దానికి నా అనుమతి ఎందుకు?" అన్నాడు కిశోర్.

"సరే! అమ్మని కూడా అడుగుతాను" అంది వసుంధర.

"ఎవరి సమ్మతం ఎందుకు? నీకా మాత్రం స్వతంత్రం లేదా? మహారాజులా ఉండు" అన్నాడు - మనస్ఫూర్తిగా.

కప్పు కింద పెడుతూ, అదే దీన స్వరంతో, "నువ్వు ఇంకో సహాయం కూడా చెయ్యాలి నాకు. రేపు ఆఫీసుకి సెలవుపెట్టి, నాతో కాస్త బయట తిరగాలి" అంది. "సరేనా?" అంది తిరిగి.

"తప్పకుండా వస్తాను. ఎక్కడికి వెళ్లాలి చెప్పు, అంతేనా? సెలవు పెట్టడం ఎంత భాగ్యం" అన్నాడతను.

"ఎక్కడికి తిరగాలి?" అడిగాడు తిరిగి.

"అత్యవసరమైన పనులు కిశోర్. నాన్నగారి లాయర్‌ని చూచి కోర్టులో ఆ జప్తు ఆర్డర్ ఎత్తించెయాలి. దానికి కొంత డబ్బు కట్టాలి. అందుకని మొదట బజారుకి వెళ్లి ఈ గజ్జల పట్టెడ అమ్మేసెయ్యాలి. బాంక్ వారితో మాట్లాడాలి. అవసరమైతే" అంది ఏకధాటిగా.

శశి కళ్లప్పగించి ఆశ్చర్యంగా చూస్తున్నాడు, అక్కకేసి. తన కళ్లు తానే నమ్మ లేకుండా.

"తప్పకుండా వస్తాను. వెళదాం. కాని ఇంత అందమైన నగ అమ్మేద్దా మంటావా!" అన్నాడు బాధగా.

"సాకేత నాన్నగారిని వదలిపోకూడదు" అంది వసుంధర దృఢంగా.

లోపల్నించి, అతి బలహీనంగా మూలుగుడు వినవచ్చింది బయటికి - భుజంగరావుగారు మేల్కొన్నారు.

ముగ్గురూ లేవబోయారు. అంతలోనే "ఒరేయ్! శశీ... ఇంకా కిశోర్... రాలే?" అని వినిపించింది. ఆగి, ఆగి, "ఇదో వచ్చేశాడు" అన్నాడు శశి. "వస్తున్నాం మామయ్యగారూ," అంటూ గంజీ పాలూ పట్టుకుని వెళుతూ, "నువ్వు నాన్నగారికి ఎదురుపడవద్దు" అన్నాడు వసుంధర పక్కకి చూస్తూ.

"నాన్నకి కనపడకుండానైనా, నాన్నని చూడనా, నేను?" అడిగింది - బ్రతిమాలుతూ శశి కళ్లు చెమ్మగిల్లినయ్యి.

తొందర తొందరగా నాన్నగారి గదిలోకి వెళ్లారు శశిన్నీ కిశోర్న్నూ. కిశోర్ పాలూ గంజి కలిపి చల్లారుస్తున్నాడు. శశి నాన్నగారిని నిమ్మళంగా లేపి నోరు కడిగించాడు — కిశోర్ పట్టుకున్న బేసిన్‌లో.

కాస్త ఆయాసం తీరాక, కిశోర్ పాలటంబ్లర్ పట్టుకొని "మామయ్యగారూ, కాస్త ఇది తాగాలి మరి. ఒక్క గుక్కెడు తాగితే చాలు మాత్ర వేసుకోవచ్చు" అన్నాడు, లాలనగా.

"ఎందుకురా గంజి, పాలు, మాత్రలు! వద్దురా. వాంతి వస్తుంది, అక్కర్లేదు" అన్నారు నాన్న.

"ఎప్పుడూ వాంతి వస్తుందా మామయ్యగారూ? ఇవ్వాళరాదు. వస్తే చూద్దాం. ఇన్నాళ్ళూ నిరాహారాలు గదా! ఈవేళ ఇవి ఇచ్చి చూడ్డమన్నారు డాక్టరుగారు. ఇందాక ఫోన్ చేశారు నాకు. కాస్త పుచ్చుకోండి - నాకోసమైనా తాగాలి మరి'' బ్రతిమాలాడు.

"వద్దురా, చెబితే విను" అన్నారు.

"వింటా. ఈ ఒక్కసారి నా మాట వినాలి మరి" అంటూ నోటి దగ్గరికి తెచ్చాడు. శశి నిమ్మళంగా నాన్నని కూచోబెట్టి వీపుని చేతులతో పట్టుకున్నాడు కిశోర్ ఒక గరిటెడు పాలు నోట్లో పోశాడు. "ఇదో ఒక్క గుక్కడేగా!'' అంటూ.

భుజంగరావుగారు అప్రయత్నంగా గబుక్కున వాంతిచేసుకోబోయారు.

తండ్రి తల దగ్గర మరుగుగా నించున్న వసుంధర, చటుక్కున తన రెండు చేతులు దోసిళ్ళు పట్టి తండ్రి నోటి కింద పెట్టింది, ఉమ్మి నాన్న ఒంటి మీద పడకుండా.

కాని భుజంగరావుగారికి వాంతి ఆగిపోయింది. ఎల్లాగో వెనక్కి మింగేశారు, కళ్ళు మూసుకొని. ఒక్క క్షణంలో తన చేతులు వెనక్కి లాగేసుకుంది, వసుంధర. మరి రెండు గుక్కలు తాగించి, నిమ్మళంగా పడుకోబెట్టారు. ఇద్దరూ నాన్నని, కాస్త విశ్రాంతి కోసం.

కిశోర్ ఆయన గొంతు నిమ్మళంగా దిగదీస్తున్నాడు. అంతలో భుజంగరావు గారు, "ఒరేయ్ కిశోర్, నువ్వు చూశావా? ఏవో రెండు చేతులు దోసిలి పట్టి, నా కళ్ల ముందర కనిపించినయ్యిరా... నువ్వు చూడలేదూ?" అడిగారు - సందేహంగా.

కిశోర్ తను ఏదీ వినబడనట్లూ, తలగడలు సర్దడం ఆరంభించాడు.

ఒక్క క్షణం ఆగి, భుజంగరావుగారు, మళ్లీ "ఒరేయ్, శశీ, నీకైనా కనిపించినాయా ఆ చేతులు... ఊం! ఊం! ఏమిరా చిన్న ఆడపిల్ల చేతులురా. గడియారం కూడా ఉందిరా చేతికి... నీకు కూడా కనబడలేదుటరా..." అన్నారు నీరసంగా.

శశికి ఆ మాటే వినిపించనట్లూ దుప్పటి మడుస్తున్నాడు.

"అయితే... మీకెవ్వరికీ కనిపించలేదన్నమాట. అయితే... నాకే ఒక భ్రమరా! భ్రమ అనుకుంటా! అయినా ఇకనెందుకు కనిపిస్తయ్యిరా ఆ చేతులు మనకి!

భ్రమ!....” అంటూండగా, కిశోర్ “మామయ్యగారూ, మాట్లాడకండి ఆయాసం వస్తుంది మీకు. నేనేమో ఎంచక్కటి ముఖ్య విషయాలు మీతో మాట్లాడాలి నేను ఒక్క రెండు నిమిషాలు. మీరు వినండి. ఏం...'' అంటూ మంచం మీద ఆయన పక్కలో కూచుని ఒక చెయ్యి ఆయన పైనించి మంచానికి అవతల పట్టె మీద పెట్టి తల నిమురుతున్నాడు.

శశి, నిమ్మళంగా లేచి నాన్న తల పక్క గుమ్మంలోకి వచ్చి, అక్కడ నించున్న అక్కకి ఏడుపు ఆపుకోటానికి ముఖం కప్పుకున్న చేతులు దించి, తను ఒక చెయ్యి పట్టుకొని శబ్దం లేకుండా వెనకవేపు మెట్ల మీద నించి, కిందికి తీసి కెళ్లాడు, నడిపించి.

హాల్లోకి వచ్చాక “అక్కయ్యా, ఇవ్వేళ చాలా పనులు ఉన్నాయి గదూ. అందుకని టిఫెన్లు పెందలాడే చేసేస్తాను. నీకు ఇష్టమైన పూరీలు, ఉల్లిగడ్డల కూర చేస్తాను. నువ్వు స్నానం చేసిరా తొందరగా” అన్నాడు.

“నేను పూరీలు ఒత్తుతాలేరా నీవు కూర మట్టుకుచెయ్యి'' అంటూ, వసుంధర హాల్లోబయట పెద్ద తలుపులు తెరిచింది.

ఎదురుగా ఆకాశం మీద తెల్లతెల్లగా తూర్పారుతూంది.

ఆ చిరు వెలుతురులో ఎక్కణ్నించో రెండు కాకులు ఎగురుకుంటూ వచ్చి ఎదురుగా ఉన్న తెల్ల గన్నేరు చెట్టు మీద వాలి, ‘కావ్’ ‘కావ్’ మంటూ అరవ నారంభించినాయి, వసుంధరని చూస్తూ ఫలహారాల కోసం.

✤ ✤ ✤